సాక్షి అనంతపురం

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



'ఏ'వన్‌గా నిలిచారు

దులీప్ ట్రోఫీని ఇండియా ఏ జట్టు కైవసం చేసుకుంది. ఇండియా సీ జట్టు రెండో స్థానంలో నిలిచింది.

8లో



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.23, సరాసరి రూ.36 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.8°/23.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఉక్కపోత పెరిగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రానున్న రెండు రోజులూ ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం విడుదల చేసిన సమాచారం ప్రకారం ఆదివారంతో పాటు సోమ, మంగళవారం కూడా ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా మోస్తరుగా వర్షం పడవచ్చన్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో ఒకట్రెండు చోట్ల భారీ వర్షం పడుతుందన్నారు.

పరవశభరితం.. 'సాయికృష్ణ లీలామృతం'



నృత్యరూపకంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ సాగిన 'సాయికృష్ణ లీలామృతం' నృత్యరూపకం భక్తులను పరవశింపజేసింది. పర్తియాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం పుట్టపర్తి ప్రశాంతి నిలయం విచ్చేశారు. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా బాలవికాస్ విద్యార్థులు, సత్యసాయి యూత్ సత్యసాయి అవతార వైభవాన్ని, భక్తుల చెంత ఆయన ప్రదర్శించిన లీలలను వివరిస్తూ 'సాయికృష్ణ లీలామృతం' నృత్యరూపకం నిర్వహించారు. కలియుగంలో జన్మించిన సత్యసాయి, శ్రీకృష్ణ భగవానుడు ఇద్దరూ ఒక్కటే నన్న సందేశాన్నిచ్చారు. చక్కటి నృత్య భంగిమలతో వారు నిర్వహించిన నృత్య రూపకం భక్తులను మైమరపించింది.

ఆలస్యంగా నీరు.. అయినా తకరారు!

నీటి నిర్వహణలో సరైన ప్రణాళికలు లేవు. డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో చేయాల్సిన పనులు చేపట్టనే లేదు. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం ఆర్భాటంగా నీటి విడుదలకు శ్రీకారం చుట్టింది. సర్కారు నిర్లక్ష్య వైఖరి కారణంగా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. పంటలు సాగు చేసినప్పటి నుంచి కోత కోసే వరకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

- నేడు మిడ్ పెన్నార్ దక్షిణ కాలువకు నీటి విడుదల
- కాలువలు బాగు చేయకనే ఆర్భాటం
- ఆరు తడి పంటలకే నీరందిస్తామంటున్న అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



మిడ్ పెన్నార్ డ్యాం

గార్లదిన్నె: మండల పరిధిలోని మిడ్ పెన్నార్ డ్యాం నుంచి దక్షిణ కాలువకు సోమవారం నీటిని విడుదల చేసేందుకు హెచ్చెల్సీ అధికారులు ఏర్పాట్లు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా జూలై, ఆగస్టు నెలల్లోనే ఆయకట్టుకు నీరందించేవారు. సకాలంలో నీరు అందడంతో ఆయకట్టు రైతులు ఆనందంగా పంటలు పండించుకున్నారు. కానీ, గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు చాలా ఆలస్యంగా నీరు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో చివరి ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. దీనికితోడు ఆరుతడి పంటల సాగుకే నీరు విడుదల చేస్తామని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూడిక తీయకనే.. కంప చెట్లు తొలగించకనే..

మిడ్ పెన్నార్ డ్యాం పరిధిలో ఉత్తర కాలువ కింద గుంతకల్లు, పెద్దవడుగూరు, పామిడి మండలాల్లో 13,325 ఎకరాలు, దక్షిణకాలువ కింద గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో 33,176 ఎకరాలు, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 31,131 ఎకరాలు మొత్తం 77,632 ఎకరాల లోకలైజ్డ్ ఆయకట్టు ఉంది. బుక్కరాయ సముద్రం, నార్పల, వెంకటంపల్లి కాలువ ద్వారా సుబ్బరాయ సాగర్‌కు నీరు వెళ్లాల్సి ఉంది. దక్షిణ కాలువ కింద 28 డిస్ట్రిబ్యూటరీలు, ఉత్తర కాలువ కింద 13 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉన్నాయి. ఇప్పటివరకూ ఆయా కాలువల్లో పూడిక తీత, కంప చెట్ల తొలగింపు వంటి పనులు చేపట్టలేదు. ఈ క్రమంలో కాలువలకు నీరు వదిలినా చివరి ఆయకట్టు భూములకు అందేది ప్రశ్నార్థకంగా మారింది.

చెరువులు నిండేనా?

గార్లదిన్నె మండలంలో తిమ్మంపేట, జంబులదిన్నె, నార్పల మండలంలో దుగుమర్రి, బుక్కరాయ సముద్రం మండలంలో చెన్నంపల్లి, పుట్లూరు మండలంలో పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులకు మిడ్ పెన్నార్ డ్యాం నుంచి నీరు అందించాల్సి ఉంది. ఈ ఏడాది డ్యాంకు కేటాయించిన 5 టీఎంసీల నీటిలోనే కాలువల ద్వారా చెరువులు నింపాలని హెచ్చెల్సీ అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. కానీ కాలువల్లో ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో చెరువులు నిండే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

అదనపు కోటా మాటే లేదు..

శింగనమల చెరువు కింద దాదాపు 2,500 ఎకరాల ఆయకట్టు ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి శింగనమల చెరువును లోకలైజేషన్ చేయించి ఒక టీఎంసీ నీరు అదనంగా కేటాయించేలా చొరవ చూపారు. రైతులను ఆదుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణి మాత్రం ఆ విషయాన్ని పట్టించుకోవడమే లేదు. మిడ్ పెన్నార్ డ్యాంకు కేటాయించిన నీరు కాకుండా అదనంగా 1 టీఎంసీ నీరు కేటాయిస్తే శింగనమల చెరువుకు అందిస్తామని హెచ్చెల్సీ అధికారులు చెబుతున్నారు.

చివరి ఆయకట్టుకూ నీరివ్వాలి..



మిడ్ పెన్నార్ డ్యాం పరిధిలోని చివరి ఆయకట్టు భూములకూ నీరు అందించాలి. ఆరుతడి పంటలకు మాత్రమే నీరు విడుదల చేస్తారని తెలియడంతో చాలా మంది వరి పంట సాగు చేయకుండా ఆయకట్టు భూములు బీడుగా పెట్టుకున్నారు. దక్షిణ కాలువ పరిధిలో ఉన్న చెరువులకు నీరు అందించాలి. చెరువుల్లో నీరు ఉంటే భూగర్భ జలాలు వృద్ధి చెంది, వ్యవసాయ బోర్లలో సమృద్ధిగా వస్తాయి. – చెన్నారెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి, గార్లదిన్నె

గతంలో జూలైలోనే వదిలేవారు..



మిడ్‌పెన్నార్ డ్యాం దక్షిణ కాలువ కింద నాకు రెండు ఎకరాల భూమి ఉంది. గతంలో జూలై, ఆగస్టు నెలలోనే ఆయకట్టుకు సాగు నీరు వదలడంతో వరి పంట సాగు చేసే వాడిని. ప్రస్తుతం సెప్టెంబర్ చివరిలో నీరు విడుదల చేస్తున్నా ఆరుతడి పంటలకే అని హెచ్చెల్సీ అధికారులు చెబుతున్నారు. దీంతో పక్క పొలం బోరు నుంచి నీరు తీసుకుంటూ మొక్కజొన్న పంట సాగు చేశా. – నాగేంద్ర,ఆయకట్టు రైతు,కమలాపురం

ఆరుతడి పంటలే సాగు చేయాలి

మిడ్ పెన్నార్ డ్యాం నుంచి సోమవారం దక్షిణ కాలువకు నీటి విడుదలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం డ్యాంలో 1.6 టీఎంసీల నీరు ఉంది. తుంగభద్ర డ్యాం నుంచి రోజుకు 300 క్యూసెక్కుల నీరు వస్తోంది. నీటి లభ్యతను బట్టి దాదాపు 120 రోజులు విడుదల చేస్తాం. పరిస్థితులను అర్థం చేసుకుని ఆరుతడి పంటలే వేసుకోవాలి.

– సురేంద్ర, ఇరిగేషన్ ఏఈఈ, మిడ్ పెన్నార్ డ్యాం

నేటితో ముగియనున్న ఈ-క్రాప్

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదుకు సోమవారంతో గడువు ముగియనున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఆదివారం నాటికి ఈ-క్రాప్ వంద శాతం పూర్తి కాగా... ఈ-కేవైసీ కూడా 85 శాతానికి పైగా పూర్తయిందన్నారు. గడువులోపు లక్ష్యం పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 10,66,675 ఎకరాలుగా అంచనా వేయగా, 9,84,516 ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చాయన్నారు. సాగు చేసిన పంటలన్నీ ఈ-క్రాప్ చేసినట్లు తెలిపారు. బయోమెట్రిక్, మొబైల్ ఓటీపీ ద్వారా ఈ-కేవేసీ కూడా 85 శాతానికి పైగా పూర్తయిందన్నారు. ఇంకా లక్ష ఎకరాల వరకు ఉన్నందున ఒక్క రోజు గడువులోపు పూర్తి కావడం కష్టమని చెబుతున్నారు. మిగతా జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నందున ఈ-కేవైసీ గడువు మరి కొన్ని రోజులు పొడిగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. గడువు పొడిగింపుతో సంబంధం లేకుండా సోమవారం చివరి రోజుగా భావించి రైతులు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఇన్‌పుట్‌సబ్సిడీ, ఇన్సూరెన్స్, మద్దతు ధరతో పంట ఉత్పత్తుల అమ్మకాలు లాంటి ప్రభుత్వం ప్రయోజనాల వర్తింపునకు ఇబ్బందులు తలెత్తుతాయి.

ఎంపీడీఓల బదిలీ

అనంతపురం సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీఓలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా నుంచి ఆరుగురు ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి ముగ్గురు ఎంపీడీఓలు అనంతపురానికి రానున్నారు. బదిలీ అయిన ఎంపీడీఓల వివరాలు ఇలా..

ఎంపీడీఓ పేరు	ప్రస్తుతం పని చేస్తున్న జిల్లా	బదిలీ అయిన జిల్లా
పి.విజయలలిత	అనంతపురం	కర్నూలు
కె.వరలక్ష్మి	అనంతపురం	కర్నూలు
ఐ.సాల్మన్	అనంతపురం	కర్నూలు
వై.పుల్లయ్య	అనంతపురం	కర్నూలు
జి.రఘునాథ్	అనంతపురం	కర్నూలు
బి.కిరణ్‌మోహన్‌రావు	అనంతపురం	వైఎస్సార్
బి.వెంకటరామిరెడ్డి	వైఎస్సార్	అనంతపురం
కె.పోలప్ప	చిత్తూరు	అనంతపురం
ఎస్.యాదవేంద్ర	చిత్తూరు	అనంతపురం

జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలన



జీడిపల్లి రిజర్వాయర్ స్థితిగతులను తెలుసుకుంటున్న మంత్రి నిమ్మల రామానాయుడు

బెళుగుప్ప: మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌ను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లు ఆదివారం వేర్వేరుగా పరిశీలించారు. తొలుత ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జీడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి జిల్లాకు అదనంగా నీటిని తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు.

• రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రలతో కలసి రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జీడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు 3,850 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం 1,800 నుంచి 1,900 క్యూసెక్కుల నీరు మాత్రమే కాలువలకు వస్తున్నాయన్నారు. కాలువల్లో 3,850 క్యూసెక్కుల సామర్థ్యం ఉంటే రాయలసీమ జిల్లాలకు 60 టీఎంసీలు తీసుకురావచ్చన్నారు. నేడు కేవలం 20 నుంచి 25 టీఎంసీలే వస్తున్నాయన్నారు. కెనాల్ విస్తరణ చేపట్టే పనుల్లో భాగంగా సీఎం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టామన్నారు. పూర్తి ప్రణాళికతో 700 కిలోమీటర్ల కాలువ విస్తరణ నివేదికలను సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, సర్పంచ్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో మంత్రులకు జీడిపల్లి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ ప్రాజెక్టు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో హంద్రీనీవా ప్రాజెక్టు సీఈ నాగరాజు, ఎస్ఈ దేశ్యానాయక్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, ఆర్‌డీఓ రాణి సుస్మిత, హంద్రీనీవా ఈఈ రాజా స్వరూప్, డీఈలు శ్రీనివాసులు, రామచంద్రమూర్తి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌పై చర్చిస్తున్నాం

అనంతపురం టవర్‌క్లాక్: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో పాలన మంచిగా అందించినట్లు తెలిపారు. రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇటీవల తుంగభద్ర 19వ గేటు కొట్టుకుపోయిన సమయంలో కర్ణాటక ప్రభుత్వం చేతులెత్తేయగా, తాము గేటు ఏర్పాటు చేసి నీటి వృథా అరికట్టామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి రాయలసీమ, ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించడానికి కారణమైన దోషులను త్వరలోనే తేలుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు హల్‌చల్ ..

రాష్ట్ర మంత్రులు బస చేసిన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద టీడీపీ నాయకుడు రెడ్డిపల్లి నాయుడు హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో సీపీఎం నాయకులతో వాగ్వాదానికి దిగాడు. మంత్రులకు సమస్యలు విన్నవించేందుకు వెళ్తున్న సీపీఎం నేత ఓబులును అడ్డుకుని దురుసుగా ప్రవర్తించాడు. పోలీసులు పక్కకు తీసుకెళ్లినా..మళ్లీ వచ్చి సీపీఎం నాయకులతో రచ్చ చేశాడు. దీంతో పోలీసులు అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మద్యం ఏరులై పారిస్తారా?

- విచ్చలవిడి విక్రయాలకు తెరలేపడం దుర్మార్గపు చర్య
- మద్యం పాలసీపై మహిళా సంఘాల మండిపాటు




మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

అనంతపురం అర్బన్: ప్రజలకు మేలు చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించేందుకు సిద్ధమయ్యారంటూ మహిళా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి ప్రసాద్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సరస్వతి మాట్లాడారు. నూతన మద్యం పాలసీ ద్వారా రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు తెరలేపడం దుర్మార్గపు చర్య అంటూ మండిపడ్డారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బెల్టుషాపుల రద్దుకు మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేశాయని గుర్తు చేశారు. నాణ్యమైన మద్యం తక్కువ ధరకు సరఫరా చేస్తామంటూ టెండర్లకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. మాదక ద్రవ్యాలు నిర్మూలించాలంటే మద్యపానం పెంచాలని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ మద్యం పాలసీని ఆదర్శంగా తీసుకోవడం సరికాదన్నారు. మద్యపాన నిషేధానికి బిహార్, తమిళనాడు, కేరళ ప్రయత్నాలు చేస్తున్నాయని, ఆ రాష్ట్రాల్లో పర్యటించిన రాష్ట్ర మంత్రివర్గ కమిటీ అక్కడి మద్యం పాలసీపై ఇచ్చిన నివేదిక బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టారన్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రజల శ్రేయస్సును ప్రభుత్వం విస్మరిస్తోందనే విషయం స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయవనరుగా మార్చి ప్రజల మానప్రాణాలతో ఆటలాడాలని చూస్తోందని మండిపడ్డారు.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రెండు వేల మద్యం దుకాణాల సంఖ్యను నాలుగు వేలకు పెంచడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. టెండర్ల ద్వారా రూ.3 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం చూస్తోందే తప్ప, ఆ తరువాతి పర్యవసానాల గురించి ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. మద్యం పాలసీపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఎరువులు, ఆహార పదార్థాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు చంద్రకళ పాల్గొన్నారు.

డీటీలు, ఎస్‌ఏలు, ఆర్‌ఐలు...

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖ పరిధిలో డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా 73 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 33 మంది సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇచ్చారు. బదిలీ అయిన డీటీలు, ఎస్‌ఏలు, ఆర్‌ఐలను ఆయా కార్యాలయాల అధిపతులు తక్షణం రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రిలీవ్ అయిన వారు కేటాయించిన స్థానాల్లో వెంటనే జాయిన్ అవ్వాలని ఆదేశించారు.

బాతు కాదు.. బొప్పాయే



ఈ ఫొటోలో కనిపిస్తోంది బాతు అనుకుంటే మీరు పొరబడినట్లే. బాతు ఆకారంలో ఉండే బొప్పాయి పండు ఇది. ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన కల్లప్ప అనే రైతు పొలంలో ఓ చెట్టుకు ఇది కాసింది. బాతు ఆకారంలో ఉండటంతో చాలా మంది ఆసక్తిగా చూశారు. – ఆత్మకూరు

తల్లడిల్లిన గుండెలు

- విషాదం నింపిన రోడ్డు ప్రమాదం
- కుమారుల మృతితో గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు
- అందరివీ రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలే
- కన్నీటి సంద్రమైన స్టాలిన్‌నగర్



ప్రమాదంలో ధ్వంసమైన ఇన్నోవా కారు



దెబ్బతిన్న లారీ ముందుభాగం



రోదిస్తున్న మృతుల కుటుంబీకులు



అనంతపురం సర్వజనాస్పత్రి మార్చురీ వద్ద గుమిగూడిన మృతుల కుటుంబీకులు, బంధువులు

అనంతపురం: ఆ నలుగురూ ప్రాణ స్నేహితులు. అందరికీ పట్టుమని పాతికేళ్లు కూడా నిండలేదు. తమ కళ్ల ముందు కలసిమెలసి ఉండే పిల్లలను చూసి ఆ తల్లిదండ్రులు నిత్యం ఎంతో ఆనందపడేవారు. అలాంటి వారిలో ఒక్కసారిగా విషాదం నిండింది. ఊహించని రోడ్డు ప్రమాదంలో వారి 'ఆశల దీపాలు' ఆరిపోవడంతో తల్లడిల్లిపోయారు. బుక్కరాయ సముద్రం మండలం రేకులకుంట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున లారీని ఇన్నోవా కారు ఢీకొన్న ప్రమాదంలో అనంతపురంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన చాకలి పవన్ (22), బలిజ పవన్‌కుమార్ (24), దాసరి శ్రీనివాసులు (24), ముస్తాక్ (23) దుర్మరణం పాలయ్యారు. ఒకేసారి కాలనీకి చెందిన నలుగురి మృతితో స్టాలిన్ నగర్ మూగబోయింది. చేతికందివచ్చిన పిల్లలు దూరమవడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో సర్వజనాస్పత్రి దద్దరిల్లింది.

పెళ్లి సంబంధాలు చూస్తుండగా..

ప్రమాదంలో మృతి చెందిన చాకలి పవన్ వడ్రంగి పని చేసేవాడు. ఈ యువకుడి తల్లిదండ్రులు లక్ష్మీ, నారాయణలది ముదిగుబ్బ మండలం గజ్జిగారి పల్లి కాగా, ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చారు. పవన్ దిన కూలీగా, కొన్ని సార్లు చిన్నచిన్న కాంట్రాక్టులు తీసుకుని ఇళ్లల్లో షోకేజ్‌లు, సెల్ఫ్‌లు చేసేవాడు. అలా కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. తమ కుమారుడికి పెళ్లి చేయాలని ఇటీవల తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే అతడు మృతి చెందడంతో వారు గుండెలవిసేలా రోదించారు. ఎంత పనిచేశావు దేవుడా అంటూ లక్ష్మీ, నారాయణ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

సంతోషం.. అంతలోనే విషాదం..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బలిజ పవన్ కుమార్ ఇటీవలే ఎంబీఏ పూర్తి చేశాడు. ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ జాబ్ వచ్చింది. వర్క్‌ఫ్రం హోం విధానంలో ఇంట్లో నుంచే పని చేస్తున్నాడు. ఉద్యోగంలో చేరి ఒక నెల అయింది. ఇంకా జీతం కూడా తీసుకోలేదు. ఒక్కగానొక్క కుమారుడికి మంచి ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు బేల్దారి ప్రసాద్, వెంకటలక్ష్మమ్మ ఎంతో సంతోష పడ్డారు. ఇక తమకు ఎలాంటి ఇబ్బందీ లేదు అనుకుంటూ ఉన్న తరుణంలోనే విషాదం చోటు చేసుకోవడంతో వారు తట్టుకోలేకపోతున్నారు. పవన్‌కు శ్రీలక్ష్మి అనే చెల్లెలు ఉంది.

చేదోడుగా ఉంటాడనుకుంటే..

దాసరి వెంకటేశులు, శారద దంపతుల కుమారుడు దాసరి శ్రీనివాసులు కారు డ్రైవర్. వెంకటేశులుకు ఇద్దరు కుమారులు కాగా, చిన్నవాడు శ్రీనివాసులు. రొద్దం మండలం తురకలాపట్నానికి చెందిన వీరు 20 సంవత్సరాల క్రితం స్టాలిన్ నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వెంకటేశులు ఎంజీ షోరూంలో లారీ కంటైనర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండే శ్రీనివాసులు మరణించాడన్న వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

మా దగ్గర ఉన్నా బతికేవాడివి కద నాన్నా..

గుంతకల్లుకు చెందిన మాబు, మున్నీ దంపతుల రెండో కుమారుడు ముస్తాక్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. చాలా కాలం స్టాలిన్‌నగర్‌లో నివాసం ఉన్న ఈ యువకుడి కుటుంబం 6 నెలల క్రితం తిరిగి గుంతకల్లుకు వెళ్లిపోయింది. ముస్తాక్ మాత్రం ఇక్కడే ఉంటూ చాకలి పవన్‌తో కలిసి వడ్రంగి పనికి వెళ్లేవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు దూరం కావడంతో మాబు, మున్నీ తల్లడిల్లిపోతున్నారు. గుంతకల్లులో తమతో పాటు ఉన్నా ఇలా జరిగేది కాదు కదా నాన్నా అంటూ గుండెలవిసేలా రోదించారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.10.5 లక్షల నగదు స్వాధీనం

కూడేరు: మండలంలోని శివరాంపేట సమీపంలో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం శివరాంపేట పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న అనంతపురం నగరానికి చెందిన ఆరుగురు, బీకేఎస్‌కు చెందిన ఇద్దరు, కొనకొండ్ల, గుంతకల్లు ప్రాంతాలకు చెందిన ఒకరు చొప్పున మొత్తం పది మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.10,52,550 నగదు, 9 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటు సారా పట్టివేత


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కంబదూరు: అక్రమంగా నాటుసారాతో పాటు కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం కంబదూరు మండలం అండేపల్లిలో ఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన వీరాంజనేయులు వద్ద 116 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం, శివన్న వద్ద 10 లీటర్ల నాటుసారా పట్టుబడింది. మద్యంతో పాటు నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం పెద్దపాడమల గ్రామానికి చెందిన మల్లికార్జున కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఆదివారం ఉదయం పెద్దపాడమల సమీపంలోని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి


షరీఫ్ మృతదేహం

గార్లదిన్నె: విద్యుత్ షాక్‌కు గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన షరీఫ్ (30)... అదే గ్రామ సమీపంలో రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన... మోటర్ ఆన్ కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి పరిశీలిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రమైనా షరీఫ్ ఇంటికి చేరుకోకపోవడంతో పొలం యజమాని అక్కడకెళ్లి పరిశీలించాడు. విగతజీవిగా పడి ఉన్న షరీఫ్‌ను గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఏ'వన్‌గా నిలిచారు

- దులీప్‌ట్రోఫీ విజేత ఇండియా–ఏ
- రెండో స్థానంలో నిలిచిన ఇండియా–సీ
- ముగిసిన దులీప్ ట్రోఫీ



విజేత ట్రోఫీతో ఇండియా–ఏ జట్టు క్రీడాకారులు

అనంతపురం: దులీప్ ట్రోఫీని ఇండియా–ఏ జట్టు కైవసం చేసుకుంది. టోర్నీలో 12 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత 9 పాయింట్లతో ఇండియా– సీ జట్టు రెండో స్థానంలో నిలిచింది. అనంత క్రీడాగ్రామం వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో చివరి రౌండ్ పోటీలు ఆదివారం ముగిశాయి. 132 పరుగులతో ఇండియా–సీ జట్టుపై ఇండియా–ఏ జట్టు, 257 పరుగుల తేడాతో ఇండియా–బీ జట్టుపై ఇండియా–డీ జట్టు విజయం సాధించాయి. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును ఇండియా–ఏ జట్టు బ్యాటర్ రావత్, ఇండియా –డీ బ్యాటర్ రిక్కీభుయి దక్కించుకున్నారు. అలాగే సూపర్‌స్ట్రైకర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును సైతం రిక్కీభుయి కైవసం చేసుకున్నాడు.ఇండియా– సీ జట్టు బౌలర్ అన్షుల్ కాంబోజ్‌కు ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది. ఇండియా–ఏ జట్టుకు విజేత కప్పును ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, ఇండియా– సీ జట్టుకు రన్నర్స్ కప్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ అందజేశారు. స్ట్రైకర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను మంత్రి పయ్యావుల కేశవ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌కు సంబంధించి ఏ గ్రౌండ్‌లో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, బీ గ్రౌండ్‌లో ఏసీఏ అతిథి ఆర్‌వీఎస్‌కే రంగారావు ప్రదానం చేశారు. ఈ నెల 5 నుంచి 22వ తేదీ వరకు జరిగిన దులీప్ ట్రోఫీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మాంఛో ఫెర్రర్ అభినందనలు తెలిపారు.

ఇండియా–డీ భారీ విజయం..

ఇండియా –బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా–డీ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది. 244/5 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో చివరి రోజు ఆటను కొనసాగించిన ఇండియా–డీ జట్టు 305 పరుగులకు ఆలౌట్ అయింది. రికీ భుయి అజేయ శతకం సాధించాడు. టోర్నీలో ఇది ఆయన రెండో సెంచరీ కావడం గమనార్హం. 124 బంతుల్లో 119 పరుగులు (15 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయంగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకుని 373 పరులు లక్ష్యాన్ని ఇండియా–బీ జట్టు ముందు ఇండియా–డీ జట్టు ఉంచింది. అర్షదీప్, థాక్రే ధాటికి ఇండియా–బీ జట్టు 115 పరుగులకే ఆలౌట్ అయింది. అర్షదీప్ ఆరు వికెట్లు, ఆదిత్య థాక్రే నాలుగు వికెట్లు పడగొట్టారు. దీంతో ఇండియా–డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో బీ జట్టుపై గెలుపొందింది.

సాయి సుదర్శన్ సెంచరీ వృథా..

270/6 పరుగుల ఓవర్‌నైట్ స్కోరు తో చివరి రోజు ఆటను కొనసాగించిన ఇండియా– ఏ జట్టు మరో 16 పరుగులు జోడించి డిక్లేర్డ్ చేసింది. భారీ పరుగుల చేధనలో 'ఏ' జట్టు బౌలర్ల ధాటికి ఇండియా–సీ జట్టు బ్యాటర్లు నిలువలేకపోయారు. 81.5 ఓవర్ల వద్ద 217 పరుగులకు ఆలౌట్ అయ్యారు. 206 బంతుల్లో 111 (12 ఫోర్లు) పరుగులు సాధించిన సాయి సుదర్శన్ ఒంటరి పోరాటం వృథా అయింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 44, వైశాఖ్ 17, ఇషాన్ కిషన్ 17 మినహా మిగిలిన వారు రెండంకెల స్కోరును కూడా దాటలేకపోయారు. ఇండియా–ఏ జట్టు బౌలర్లలో ప్రసిద్ధ్‌కృష్ణ 3, తనుష్ కోటియన్ 3, అకీబ్‌ఖాన్ 2, ములాని ఓ వికెట్ తీసుకున్నారు. దీంతో ఇండియా–ఏ జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో ఏసీఏ కౌన్సిలర్ డి. గౌర్ విష్ణు, గేమ్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎంఎస్ కుమార్, కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.


రుతురాజ్ గైక్వాడ్‌కు రన్నర్స్ కప్ అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్


అన్షుల్ కాంభోజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందజేస్తున్న మాంఛో ఫెర్రర్

లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం తగదు

- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ రాజకీయం
- టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థనాయక్



మాట్లాడుతున్న అశ్వత్థనాయక్

అనంతపురం కార్పొరేషన్: రాజకీయ లబ్ధి కోసమే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై టీడీపీ దుష్ప్రచారంచేస్తోందని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థనాయక్ అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు, టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణను ఆయన ఖండించారు. ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. నిర్దేశించిన ప్రమాణాలు లేకుంటే నెయ్యి ట్యాంకర్‌ను గోదాములోకి కూడా అనుమతించరనే విషయాన్ని తెలుసుకుని మాట్లాడాలన్నారు. వంద రోజుల పాలనలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇప్పటి వరకూ అమలు చేయలేదని, ఈ అంశంపై దృష్టి సారించకుండా ప్రజలను ఏమార్చేందుకు ఇంతటి నీచానికి చంద్రబాబు అండ్ కో దిగజారారని మండిపడ్డారు. త్వరలో నిజనిజాలు తప్పక వెలుగు చూస్తాయన్నారు.

అనుమతి లేకుండా స్టిక్కర్ ఎలా వేస్తారు?

- టీడీపీ నాయకులను నిలదీసిన ఇంటి యజమాని
- అతనిపై దాడికి ప్రయత్నించిన 'తమ్ముళ్లు'


టీడీపీ నాయకులను నిలదీస్తున్న ఇంటి యజమాని

యాడికి: అనుమతి లేకుండా తమ ఇంటికి టీడీపీ స్టిక్కర్ ఎలా వేస్తారంటూ యాడికి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆ పార్టీ నాయకులను నిలదీశారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు అతనిపై దాడికి యత్నించారు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని వైశ్యా వీధిలో ఆదివారం సాయంత్రం టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ రంగయ్య, ఆ పార్టీ నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల అనుమతి లేకుండానే వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ సమీపంలోని ఓ ఇంటి గోడపై స్టిక్కర్ అతికించగా.. యజమాని అభ్యంతరం తెలిపాడు. తమ అనుమతి లేకుండా ఎలా అతికిస్తారంటూ నిలదీశాడు. దీంతో టీడీపీ నాయకులు అతనిపై దాడికి ప్రయత్నించారు. అయినప్పటికీ వెనక్కి తగ్గలేదు. తాను ఏ పార్టీకీ సంబంధించిన వ్యక్తిని కాదని, తనకు అందరూ కావాలని, స్టిక్కర్ తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో తోకముడిచిన 'తమ్ముళ్లు' స్టిక్కర్ తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

'విశాఖ ఉక్కు'పై ఉద్యమ కార్యాచరణ

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్
- కూటమి ప్రభుత్వ ద్వంద వైఖరిపై ధ్వజం


మాట్లాడుతున్న జాఫర్, తదితరులు

తాడిపత్రి టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దీనిపై ఉద్యమ కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని కూటమి సర్కార్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ హెచ్చరించారు. తాడిపత్రిలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాఫర్ మాట్లాడుతూ... విశాఖ ఉక్కు పరిశ్రమను నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ పెద్దలు ఏకమై ఢిల్లీ వేదికగా ఆందోళనలు చేపట్టారని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే సీఎం చంద్రబాబు యూటర్న్ తీసుకుని విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయడానికి కుట్రలు సాగిస్తుండడం సిగ్గుచేటన్నారు. ఫ్యాక్టరీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు ఇప్పటి నుంచే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పోరాటాలు చేపట్టి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి, తాడిపత్రి మండల కార్యదర్శి నాగరంగయ్య, వ్యకాసం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'ఏపీహంస' జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం


ఎంపికైన ఏపీ హంస నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం మెడికల్: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) ఎన్నికలు ఆదివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగాయి. అధ్యక్షుడిగా ఎస్ మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షురాలిగా పి.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా జి.సుజాత, ఎ.రవీంద్ర, పి.నాగలక్ష్మి, దేవి, కె.అరుణ కుమార్, కోశాధికారిగా ఈశ్వరయ్య, వెంకటకృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులుగా పి.లత, రాఘవేంద్రారెడ్డి, వాణి నాయుడు, ఎం.నాగలక్ష్మి, కార్యనిర్వహణ కార్యదర్శిగా మహేంద్రబాబు, మహిళా విభాగం కార్యదర్శిగా చక్రాల పద్మజ, ప్రచార కార్యదర్శిగా పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రతి టీచరూ అనధికార శాసనకర్తే

- ఏపీటీఎఫ్ జిల్లా మహాసభల్లో ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఉపాధ్యాయుడూ అనధికార శాసనకర్తేనని ఎస్కేయూ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలు ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగాయి. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన వహించారు. 'ఉపాధ్యాయ అస్తిత్వం – నాడు.. నేడు' అంశంపై బాలసుబ్రహ్మణ్యం ప్రసంగించారు. తరగతి గది అనేది ఏ దేశానికైనా ఎనలేని పెట్టుబడి అన్నారు. ప్రభుత్వ బడి ప్రజాస్వామ్యానికి గట్టి పునాదిగా అభివర్ణించారు. ప్రభుత్వ బడులన్నీ ప్రజలవని, ప్రైవేట్ బడులు వ్యక్తులవని పేర్కొంటూ ప్రజల బడులను కాపాడడంలో ముందుండాలని ఉపాధ్యాయ సంఘాలకు పిలుపునిచ్చారు. మరో అతిథి డాక్టర్ రవిశ్రీనివాస్ 'పిల్లల్లో విపరీత ధోరణులు' అంశంపై మాట్లాడారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ ఉద్యమాన్ని పెడదోవ పట్టించే రాజకీయ పార్టీల మాయలో చిక్కుకోరాదని, సమాజ శ్రేయస్సే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటసుబ్బయ్య, పి. వరప్రసాద్, మహమ్మద్ రఫీ, శ్రీనివాసనాయక్, సత్యప్రసాద్, వెంకటరెడ్డి, రవీంద్ర, పోతులయ్య, ఆంజనేయులు నాయక్, అశోక్ నాయక్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్‌లో భారీగా బదిలీలు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్ సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, డీఎల్‌డీఓలను బదిలీ చేశారు. సొంత జిల్లాల్లో పాతికేళ్లకు పైబడి పని చేసిన వారందరికీ జిల్లా సరిహద్దులు దాటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఆదివారం రాత్రి జిల్లాలకు అందాయి. జెడ్పీ సీఈఓగా నంద్యాల జిల్లా డ్వామా పీడీగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిని నియమించారు. అయితే ఆయన రెండున్నర నెలల పాటు ఆయన సెలవు పెట్టి సొంత పనిపై ఆదివారం రాత్రే అమెరికాకు బయలదేరినట్లు సమాచారం. ఇప్పటి వరకూ జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా పనిచేస్తున్న ఓబుళమ్మను కడప జెడ్పీ సీఈఓగా నియమించారు. కడప డీఎల్‌డీఓ జి.వెంకటసుబ్బయ్యను అనంతపురం జెడ్పీ డిప్యూటీ సీఈఓగా, ఇక్కడి డిప్యూటీ సీఈఓ కె. లలితాబాయిని అనంతపురం రెగ్యులర్ డీఎల్‌డీఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సైనిక సంక్షేమ శాఖ అధికారిగా పని చేస్తూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన శ్రీనివాసులును వైఎస్సార్ జిల్లా బద్వేలు డీఎల్‌డీఓగా నియమించారు. కదిరి డీఎల్‌డీఓగా పని చేస్తున్న సి.సూర్యనారాయణను నంద్యాల జిల్లా ఆత్మకూరుకు బదిలీ చేశారు. అనంతపురం డ్వామా ఇన్‌చార్జ్ పీడీ పి.విజయలక్ష్మిని గుంతకల్లు డీఎల్‌డీఓగా నియమించారు. అనంతపురం డీఆర్‌డీఏ పీడీగా పని చేసి సెలవుపై వెళ్లిన నరసింహారెడ్డిని నంద్యాల జిల్లా డోన్ డీఎల్‌డీఓగా నియమించారు. కడప జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పని చేస్తున్న ఎం.సుధాకర్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి డీఎల్‌డీఓగా నియమితులయ్యారు. కడప ఏపీడీగా తాడిపత్రి ఏపీడీ టి.వెంకటరత్నం, కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ వి.శంకర్‌ను గుంటూరు జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. అనంతపురం డ్వామా పీడీగా కర్నూలు డ్వామా పీడీ ఎస్.సలీం బాషా నియమించారు.

పంచాయతీరాజ్ ఎస్ఈగా జహీర్ అస్లాం

పంచాయతీరాజ్ అనంతపురం జిల్లా ఎస్ఈగా అహమ్మద్ జహీర్ అస్లాం నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కేవీకేవీ ప్రసాద్ పీఐయూ ఈఈగా కొనసాగుతారు. మరో నెల రోజుల్లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. పంచాయతీరాజ్ అనుబంధ అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా పని చేస్తున్న బి.చంద్రశేఖర్‌ను పార్వతీపురం పీఆర్ఐ ఈఈగా బదిలీ చేశారు.

కనుల పండువగా తీజ్ ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ జాతీయ నేత నినావత్‌భిక్కు నాయక్, తదితరులు

వజ్రకరూరు: మండలంలోని రూపానాయక్ తండాలో ఆదివారం హర్యాలీ తీజ్ ఉత్సవాలు కనుల పండువగా సాగాయి. వేడుకలకు బీజేపీ జాతీయ నేత నినావత్‌భిక్కునాయక్ హాజరయ్యారు. ఉత్సవాలు ప్రారంభంలో వెదురుబుట్టలో వేసిన గోధుమలు మొలకెత్తడాన్ని ఆసక్తిగా గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హర్యాలీ తీజ్ ఉత్సవాలను జాతీయ స్థాయిలో ప్రభుత్వాలే అధికారికంగా నిర్వహించాలని, ఏపీలో తండా డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేయాలని, సేవాలాల్ జయంతి, హర్యాలీ తీజ్, హోలీ పండుగలకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళతానన్నారు. కార్యక్రమంలో బంజారా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రతినిధి సుబ్రహ్మణ్యం నాయక్, గ్రామ పెద్దలు దాసునాయక్, ఉమాపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీపీఎస్‌ఏ నూతన కార్యవర్గం ఎన్నిక


ఏడీపీఎస్‌ఏ జిల్లా, నగర నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (ఏడీపీఎస్‌ఏ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం నగరంలోని సంగమేష్ నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మనోరంజన్ హాజరయ్యారు. జిల్లా నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా గంగాధర్ యాదవ్, అధ్యక్షుడిగా గోపాలరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్ర శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి, కోశాధికారిగా రామచంద్ర, సీఆర్‌ఓగా రవిచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీవాత్సవ, నగర అధ్యక్షుడిగా భాస్కరరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శిగా విజయకుమార్, కోశాధికారిగా జానకీరాములు, జిల్లా ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర, బాబయ్య, ప్రభంజనరెడ్డి, ఆంజనేయరెడ్డి, శ్రీధర్, రవి, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్‌రెడ్డి, మహమ్మద్ అమీన్, సుధాకర్, సోమశేఖర్, వేణు, రఫీ, ఈసీ సభ్యులుగా రాజారమేష్, గౌరవ సలహాదారుగా రామాంజనేయులు, ఎంసీ మద్దయ్య ఎన్నికయ్యారు.

ఎన్‌సీసీ శిక్షణతో బంగారు భవిత


కూడేరు: ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా బంగారు భవిష్యత్తు ఉంటుందని క్యాడెట్లకు ఎన్‌సీసీ నగర్ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రోడ్రిక్స్, డిప్యూటీ క్యాంప్ కమాండర్ (డీసీసీ) కల్నల్ ఎంఎస్ కులకర్ణి సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 6వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో సీఏటీసీ–7 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాడెట్లనుద్దేశించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో క్యాంప్ అడ్జుటెంట్ సుమితా హరికృష్ణ, ఎల్‌టీ రంగనాథ్, అధికారులు సంగీతశశికళ, ప్రగతికుమార్, తేజశ్విని, వివిధ జిల్లాలకు చెందిన 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

బైక్‌పై దూసుకెళ్లిన లారీ

గుత్తి: బైక్‌పై లారీ దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గుత్తిలోని గాంధీ సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి రోడ్డు పక్కన ఆగి ఉన్న బైక్ పైకి లారీ దూసుకెళ్లింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న గుత్తికి చెందిన అరుణ్, ఉపేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న అరుణ్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

5 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నిర్మాణ సభలు

- ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర నిర్మాణ సభలు అక్టోబరు 5 నుంచి 8వ తేదీ వరకూ అనంతపురంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఆదివారం అనంతపురంలోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ... సభలకు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షుడు పి. సాను పాల్గొంటారని, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 450 మంది నాయకులు హాజరవుతారన్నారు. కూటమి సర్కార్ అధికారంలో వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రోజురోజుకూ పుట్టగొడుగుల్లా విద్యా రంగ సమస్యలు పుట్టుకొస్తున్నాయన్నారు. మెడికల్ కళాశాలలు నిర్వహించలేమంటూ 700 ఎంబీబీఎస్ సీట్ల రద్దుకు చంద్రబాబు ప్రభుత్వం రాసిన లేఖను తప్పుబట్టారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను ఈ సభల్లో రూపొందించి, ఆ దిశగా పోరుబాట పడతామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల విభాగం కన్వీనర్ రజిత, జిల్లా అధ్యక్షుడు సిద్దు, ఉపాధ్యక్షులు రమేష్, శివ, సహాయ కార్యదర్శులు సూర్యప్రకాష్, భీమేష్, వంశీ, నగర నాయకులు సోము, గణేష్, మోహన్ పాల్గొన్నారు.

12 గంటల్లో 17 ఎకరాల్లో గుంటక


మిరప చేనులో గుంటకబాస్తున్న రైతు హనుమంతు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన రైతు కె.హనుమంతు అరుదైన రికార్డు సృష్టించాడు. కేవలం 12 గంటల్లో 17.20 ఎకరాల్లో బాడుగ గుంటకతో పొలాన్ని బాసి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. వివరాలు... గోవిందవాడకు చెందిన గురురాజుకు చెందిన 10 ఎకరాలు, దివాకర్ చెందిన 7.20 ఎకరాల్లోని మిరప పంటలో ఆదివారం వేకువ జాము 4 గంటలకు ఎద్దులతో గుంటక మొదలు పెట్టిన హనుమంతు... సాయంత్రం 4 గంటలకు పూర్తి చేశాడు. దీంతో గ్రామస్తులు ఎద్దులతో పాటు హనుమంతును అభినందిందించి సన్మానించారు. సాధారణంగా 17.20 ఎకరాల్లో గుంటక బాసాలంటే మూడు, నాలుగు రోజులు సమయం పడుతుందని గ్రామస్తులు తెలిపారు.

గోవును అపహరించారంటూ గొడవ

గుంతకల్లు టౌన్: స్థానిక బీఎస్ఎస్ కాలనీలో మూడు రోజుల క్రితం తప్పిపోయిన ఆవును యజమాని చంద్రతో కలిసి వెతికేందుకు వెళ్లిన బీజేవైఎం పట్టణాధ్యక్షుడు రవితేజ, కార్యకర్త మోహన్‌పై గొడ్డు మాంసం విక్రేతలు దాడికి పాల్పడ్డారంటూ ఆదివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి పాతబస్టాండ్‌లోని బీఫ్ దుకాణాల వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని బీఫ్ దుకాణాలకు మూతవేయించారు. దీంతో పరిస్థితి అదుపు తప్పడంతో ఇరువర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రవితేజ, మోహన్‌పై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని, పట్టణ నడిబొడ్డున గోవులను వధించి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ బీజేవైఎం నాయకులు ఫిర్యాదు చేశారు. తాము గొడ్డు మాంసం విక్రయిస్తున్నది వాస్తవమేనని అయితే గోవులను వధించడం లేదనిడీఎస్పీ శ్రీనివాసులు వద్ద వ్యాపారస్తులు వాపోయారు. ఆవు తప్పిపోతే పోలీసులకు ఫిర్యాదు చేయకుండా శనివారం రాత్రి 11 గంటల సమయంలో బీఫ్ విక్రేతల ఇళ్లల్లోకి చొరబడి మహిళలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. సున్నితమైన ఈ అంశాన్ని పెద్దదిగా చేయడం సబబు కాదని ఇరు వర్గాలకూ డీఎస్పీ శ్రీనివాసులు హితవు పలికారు. అనంతరం పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు గుంతకల్లు, గుత్తి, పామిడి సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ ఫోర్స్‌తో పట్టణంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఘటనపై పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారంటూ ఆదివారం రాత్రి ప్రభుత్వాస్పత్రి ఎదుట బీజేవైఎం నాయకులు ధర్నా చేపట్టారు.

ప్రభుత్వం మాది.. వారి పేర్లు ఎలా వేస్తారు?



- శిలాఫలకాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పేర్లు బలవంతంగా తొలగింపు
- పాపంపేటలో బరి తెగించిన టీడీపీ చోటా నాయకులు
- ఎమ్మెల్యే పరిటాల సునీత శిలాఫలకాలు ప్రారంభించి వెళ్లగానే పెయింట్‌తో స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లను తుడిచేసిన నాయకులు
- ప్రొటోకాల్‌కు మంగళం పాడటంపై తప్పుపడుతున్న స్థానికులు

రాప్తాడు రూరల్: పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించే విషయంలో ప్రభుత్వాలతో సంబంధం ఉండదు. కచ్చితంగా ప్రొటోకాల్ పాటించాల్సిందే. రాప్తాడు నియోజకవర్గంలో అలాంటి నిబంధనలను పట్టించుకోవడం లేదు. 'ప్రభుత్వం మాది మేము చెప్పినట్టు వినాల్సిందే' అనే ధోరణితో చోటా నాయకులు రెచ్చిపోతున్నారు. వీరి నిర్వాకంపై ప్రజలు అసహ్యించుకుంటున్నారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ, వాటర్ ప్లాంట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో వైఎస్సార్‌సీపీ అనే అక్కసుతో స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లను తొలిగించడం తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో అధికార పార్టీ చోటా నాయకుల బరి తెగింపునకు ఈ ఘటన సాక్ష్యంగా నిలుస్తోంది.

ఎంపీటీసీ సభ్యుడికి బెదిరింపులు

ప్రొటోకాల్ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులకు పంచాయితీ అధికారులు సమాచారం అందించారు. ఇందులో భాగంగా ఎంపీటీసీ సభ్యుడు సందీప్ యాదవ్ వాటర్‌ప్లాంట్ ఓపెనింగ్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారు. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు తీవ్ర అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ బెదిరించారు. తాను ఎంపీటీసీ సభ్యుడి హోదాలో వచ్చానని గట్టిగా మాట్లాడినా లాభం లేకపోయింది. టీడీపీ నాయకుల బెదిరింపులు చూసి అక్కడున్న వారి కార్యకర్తలు సైతం ముక్కున వేలేసుకున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు తప్పితే.. టీడీపీ చోటా నాయకులను పల్లెత్తు మాట మాట్లాడలేదు. దీంతో సందీప్ యాదవ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎమ్మెల్యే పరిటాల సునీత వెళ్లిపోగానే..

కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత అక్కడి నుంచి వెళ్లిపోగానే చోటా నాయకులు అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న నల్లరంగును శిలాఫలకాల్లోని స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లు కనిపించకుండా పూసేశారు. మరీ ఇంత దౌర్జన్యమేంటంటూ స్థానికులు వీరి వైఖరిపై మండిపడుతున్నారు.



శిలాఫలకంలో ముందు రోజు ఉన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పేర్లు



ఎమ్మెల్యే వచ్చి వెళ్లిన తర్వాత కనిపించని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పేర్లు

బూతులు తిడుతూ గెంటేశారు



తన ఎంపీటీసీ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలకు ప్రొటోకాల్ మేరకు పంచాయతీ అధికారులు సమాచారం ఇచ్చారు. వాటర్‌ప్లాంట్ ప్రారంభ కార్యక్రమానికి వెళ్లాను. కొందరు స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ఇక్కడికి ఎందుకొచ్చావ్.. నీకేం పని అంటూ బూతులు తిడుతూ అక్కడి నుంచి గెంటేశారు. ప్రొటోకాల్ పాటించాల్సిన అధికారులు కనీసం పట్టించుకోలేదు. టీడీపీ నాయకులు ఆగడాలు ఎక్కువయ్యాయి.

– సందీప్ యాదవ్ ఎంపీటీసీ సభ్యుడు

అసలేం జరిగిందంటే..

విద్యారణ్య నగర్, పాపంపేట, భాగ్యనగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గత ప్రభుత్వంలో పూర్తయిన తాగునీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీతతో శనివారం ప్రారంభించాలని నిర్ణయించారు. మూడు చోట్లా శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి మొదలుకుని స్థానిక ఎంపీటీసీ సభ్యుడి వరకు ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ శిలాఫలకాల్లో పేర్లు పొందుపరిచారు. ఇందులో భాగంగా ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జె.చంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యులు కె.వెంకటేశులు, కె.సందీప్, ఎం.మౌనిక రాజ్యం పేర్లను అధికారులు వేయించారు. శిలాఫలకంలో ఉన్న పేర్లను చూసి స్థానికంగా ఉన్న ఓ చోటా నాయకుడికి కోపం వచ్చిందట. సంబంధిత అధికారులపై ఊగిపోతూ వారిపేర్లు ఎందుకు వేయించారు. వెంటనే ఆ పేర్లు కనిపించకుండా పెయింట్ వేయించండంటూ ఆదేశాలు జారీ చేశాడు. ఇందుకు అధికారులు ససేమిరా అన్నారు. ప్రొటోకాల్ పాటించకపోతే తమకు ఇబ్బందులు వస్తాయని సదరు అధికారులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వచ్చి వెళ్లిన వెంటనే వారి పేర్లపై పెయింట్ వేసి కనిపించకుండా చేయాలని నిర్ణయించుకున్నారు.

క్లుప్తంగా

ఆత్మకూరు ఎస్ఐగా లక్ష్మీనారాయణ



ఆత్మకూరు: ఆత్మకూరు మండల నూతన ఎస్ఐగా లక్ష్మీనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మండలంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకు రావాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ ప్రజలకు సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని పేర్కొన్నారు.

మెనూ అమలు చేయండి

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నగరంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హరీష్ యాదవ్ ఇంటికి సూర్యకుమార్



భారత ఆటగాడు సూర్యకుమార్ యాదవ్‌తో హరీష్ యాదవ్ కుటుంబ సభ్యులు

అనంతపురం కార్పొరేషన్: భారత జట్టు క్రీడాకారుడు సూర్యకుమార్ యాదవ్ ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత హరీష్‌కుమార్ యాదవ్ ఇంటికి వెళ్లారు. దులీప్ ట్రోఫీలో భాగంగా ఆయన అనంతపురానికి వచ్చిన విషయం విదితమే. దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు ముగిశాక తిరుగు ప్రయాణంలో హరీష్ యాదవ్ ఇంటికి వెళ్లారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అరవింద్‌గౌడ్

ధర్మవరం: హాకీ ఇండియా ఆధ్వర్యంలో జరగనున్న 14వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనబోయే రాష్ట్ర జట్టుకు పట్టణానికి చెందిన హాకీ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈమేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, టీమ్ మేనేజర్ అరవింద్‌గౌడ్ ఆదివారం తెలిపారు. ఈనెల 23 నుంచి అక్టోబర్ 3 వరకు చండీఘడ్‌లో జరగనున్న 14వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున ధర్మవరం క్రీడాకారులు ఫజులుద్దీన్, శబరీష్‌గౌడ్ పాల్గొంటారన్నారు. క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు..

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్‌తేజ్ జూడో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 19న అనంతపురంలోని గుడ్ చిల్డ్రన్ స్కూల్‌లో స్కూల్ గేం అండర్–14 జూడో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహినిర్వహించారన్నారు. జెడ్పీ హైస్కూల్‌లోని 9వ తరగతి చదువుతున్న దర్శన్ తేజ్ ప్రతిభ కనబరిచి ఈ నెల 23న తిరుపతిలో జరిగే స్కూల్ గేం ఫెడరేషన్ జూడో అండర్–14 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పీడీతోపాటు ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఉపాధ్యాయులు, లలితమ్మ, అంకిరెడ్డి, అభినందించారు.

అన్ని చెరువులకు నీరు ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని జలసాధన సమితి జిల్లా అధ్యక్షుడు రామకుమార్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకుమార్ మాట్లాడుతూ.. 77,900 ఎకరాలకు నీరు అందించేందుకు పథకాన్ని రూపొందించారన్నారు. దీనిలో 32 వేల ఎకరాలకు కుదించినట్లు తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ కింద 10 వేల ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉండగా.. అది పూర్తిగా ఎత్తి వేశారన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి 11 మండలాలకు 265 చెరువులు నింపడాని 5 టీఎంసీల నీరు అవసరం ఉందని పేర్కొన్నారు. కాలువలు ఆధునీకరణ చేసి అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, కిష్ట, ఈరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణమ రాజును అరెస్ట్ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని ఎమ్మెల్యే రఘురామ కృష్ణమ రాజు బహిరంగంగా చింపివేయడం దారుణం. వెంటనే ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కోడవండ్ల డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుపాడులో టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణమ రాజు, జనసేన పార్టీ నేతలు కలిసి అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపివేయడం దళితులను కించపరచడమే అన్నారు. అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఓ డాక్టర్‌పై దాడి చేసిన ఎమ్మెల్యేను కూడా వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోక పోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రావులచెరు ఓబుళ రాజు, కిష్ట, గౌసియా, గోవింద్ నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలోనే నడవాలి



మాట్లాడుతున్న బంగారయ్య శర్మ



కార్యక్రమానికి హాజరైన హనుమాన్ చాలీసా పారాయణ సమితి ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: అలజడి, ఒత్తిడితో నిండిపోతున్న సమాజానికి భక్తిమార్గం మాత్రమే దిశా దర్శనం చేస్తుందని ఆధ్యాత్మిక శాస్త్రవేత్త బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ అన్నారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా హనుమాన్ చాలీసా పారాయణ ప్రచార సమితి ప్రతినిధి ప్రమోద్ స్వామి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ సమితి ప్రతినిధులు సమావేశం జరిగింది. వివిధ ఆలయాల నుంచి ఆలయ కమిటీ ధర్మకర్తలు, మహిళా మండలి సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా బంగారయ్య శర్మ మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించే విజయమే భక్తిమార్గమని దానిని పెంపొందించుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం సాగుతోందన్నారు. చిన్మయా మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతీ మాట్లాడుతూ.. రామాయణ ఇతిహాసం ద్వారా హనుమంతుడు ప్రదర్శించిన అసమాన తేజోవిక్రమం అందరిలో పాదుకొల్పడానికి దాదాపు 120 ఆలయాల్లో నిత్య చాలీసా పఠనం సాగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రతి ఆలయంలో కొనసాగేలా చూస్తామన్నారు. బెల్దోనా స్వామి మాట్లాడుతూ.. డిసెంబర్ నెలలో అనంత వేదికగా పది వేల మందితో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించాలని తీర్మానించామన్నారు. అనంతరం ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం సంప్రదాయ నృత్యాలతో స్వామికి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో గురుస్వామి కుర్లపల్లి రంగాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం వైఎస్ ప్రకాష్ ఆచారి, వేణుగోపాల్, హర్షవర్ధన్ జైన్, భార్గవ శర్మ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆ పాత మధురాలు



అక్కినేని పాటలతో ఉర్రూతలూగిస్తున్న గాయనీ గాయకులు



అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలకు హాజరైన అభిమానులు

అనంతపురం కల్చరల్: నేను పుట్టాను లోకం నవ్వింది.. నిన్న లేని అందమేదో నిదుర లేచినెందుకో అంటూ అనంత గాయనీ గాయకులు ఆలపించిన ఆ పాత మధురాలు ప్రేక్షకులను అలరించాయి. బాలమురళి, రామాంజి, శ్రీదేవి, విజయలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు అక్కినేని మధుర గీతాలతో శ్రోతలను ఉర్రూతలూగిస్తూ హుషారు నింపారు. నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 101 జయంతి వేడుకలు ఆదివారం రాత్రి స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో జరిగాయి. అనంత అక్కినేని అభిమాన సంఘాలు, క్లాస్ ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి విజిలెన్స్ శాఖ ఎస్పీ మునిరామయ్య, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. అక్కినేని నాగేశ్వరరావు లాంటి మహానటులు అరుదుగా జన్మిస్తారన్నారు. ఆయన ప్రతి సినిమా తర్వాతి తరం నటీనటులకు ఒక డిక్షనరీగా అభివర్ణించారు. అంతకు ముందు పలువురు గాయనీ గాయకులు, కళాకారులు అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అభిమాన సంఘాల నిర్వాహకులు షఫీ, నగేష్, సతీష్, భరత్, ఘంటసాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: మేయర్ వసీం సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మేయర్ వసీం ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులకు తెలియజేశారు. నగరాల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి రాబోయే రోజుల్లో చేపట్టబోతున్న ఆధునీకరణ అంశాలపై నిర్వహించనున్న కాన్క్లేవ్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చిందన్నారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఢిల్లీలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో సమావేశం జరుగుతుందని వెల్లడించారు. నగరాలు, పట్టణాల్లో గత పదేళ్లలో సాధించిన అభివృద్ధి ఫలాలను వివరించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పలు అంశాల్లో నిష్ణాతులైన నిపుణులు కాన్క్లేవ్‌కు హాజరవుతారని పేర్కొన్నారు. పట్టణ వ్యవహారాలు, పర్యావరణం, శీతోష్ణస్థితిలో మార్పు, సుస్థిరమైన అభివృద్ధిపై చర్చిస్తామని తెలిపారు. ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం ద్వారా రాబోయే రోజుల్లో నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన వస్తుందన్నారు. ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లవచ్చన్నారు. ఢిల్లీలో జరిగే సదస్సులో పాల్గొనేందుకు తనకు అవకాశం రావడం నగర ప్రజలకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. మెట్రో నగరాలు, ఇతర నగరాలు ఏ విధంగా అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నాయో తెలుసుకునేందుకు సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన నారాయణప్ప

ధర్మవరం రూరల్: మండలంలోని సీతారాంపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణప్ప అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నారాయణప్ప స్వగ్రామమైన కనగానపల్లి మండలం చంద్రాశ్చర్ల నుంచి ద్విచక్ర వాహనంపై ధర్మవరం వెళ్తుతుండగా లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణప్ప తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వృద్ధున్ని 108 వాహనంలో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



అలంకరణలో మంజునాథుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. తొలుత స్వామిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆకుపూజ అనంతరం మహా మంగళహారతి అందించారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం ఆలయంలో కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. అలాగే ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

26న హుండీ కానుకల లెక్కింపు

ఈనెల 26వ తేదీన ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ఉంటుందని ఆలయ ఈఓ అక్కిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఆలయ నిబంధనల ప్రకారం కానుకల లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

కౌంటర్ పోయింది.. బోర్డు మిగిలింది!



కలెక్టర్ కార్యాలయంలోని రిసెప్షన్ కౌంటర్

అనంతపురం అర్బన్: ఇది జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రిసెప్షన్. ఇక్కడ బోర్డు మాత్రమే ఉంటుంది. కౌంటర్ ఉండదు. ఓ ప్రైవేట్ ఏజెన్సీ ఇచ్చే ఐఎస్ఓ సర్టిఫికెట్ కోసం వారి సిఫారసు మేరకు అప్పట్లో ఈ రిసెప్షన్ కౌంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. వివిధ పనులపై కలెక్టరేట్‌కు వచ్చేవారికి సరైన సమాచారం అందించాలనే ఉద్దేశ్యంతో కార్యాలయ ప్రవేశం వద్ద రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేసి, ఓ ఉద్యోగిని సైతం నియమించారు. ఎప్పుడైతే కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందిందో... ఆ తర్వాత రిసెప్షన్ బోర్డు మాత్రమే మిగిలింది... కౌంటర్ పోయింది. పరిపాలన అంశాల్లో మిగిలిన శాఖలకు ఆదర్శంగా ఉండాల్సిన కలెక్టరేట్‌లో చోటు చేసుకున్న ఈ పరిణామాన్ని గమనించిన పలువురు నవ్వుకుంటున్నారు. 'ఏదైనా కానీ తమ దాకా వస్తే తప్ప అసలు ఇబ్బందులు ఏమిటో తెలియనేది ఇందుకేనేమో' అని గుసగుసలాడుతున్నారు.

స్వచ్ఛత పక్కకు.. యంత్రాలు మూలకు



ఎంపీడీఓ కార్యాలయం లోపలికి వెళ్లే చోట చెత్త ఇలా..

- తుప్పపడుతున్న చెత్త సేకరణ వాహనాలు
- పేరుకుపోయిన చెత్తా చెదారం

ఆత్మకూరు: గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం లక్ష్యం నీరుగారిపోతోంది. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్తా, చెదారం పేరుకుపోయింది. దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపటాల్సి ఉంది. గ్రామాలను శుభ్రంగా ఉంచాలి. అయితే ఆ కార్యక్రమం మాత్రం ప్రస్తుతం ఫొటోలకే పరిమితమైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లోపలికి వెళ్లే దారిలో, కార్యాలయం ఎదురుగా చెత్త దిబ్బలు పేరుకుపోయాయి. కార్యాలయాల ఎదుటే చెత్త దిబ్బలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో చెత్తను సేకరించడానికి గత ప్రభుత్వంలో ఈ–ఆటోలు, రిక్షాలు ఏర్పాటు చేశారు. కాని వాటిని వినియోగించకుండా మండల కేంద్రంలోని పంచాయితీ కార్యాలయంలో ఓ మూలన పడేశారు. దీంతో ఆ వాహనాలు కాస్త తుప్పు పట్టి పనికిరాకుండా పోయే పరిస్థితి నెలకొంది.



ఆత్మకూరులో మూలనపడిన చెత్త సేకరణ ఈ–ఆటోలు

నీరుగారుతున్న లక్ష్యం..

మండలానికి 6 ఈ–ఆటోలు, 26 రిక్షాలు వచ్చాయి. వీటిలో కొన్ని రిక్షాలను పంచాయితీలకు అందించారు. మిగిలిన వాటిని మాత్రం ఓ మూలన పడేశారు. ఈ–ఆటోల్లో బ్యాటరీలు, రిక్షాల టైర్లు పనికిరాకుండా పోయాయి. రూ.లక్షలు ఖర్చు చేసి వినియోగించాల్సిన వాహనాలను వినియోగించలేదు. ప్రస్తుతం ఎలాంటి వినియోగం లేకపోవడంతో ఆ వాహనాలు కాస్త ఎండ, వర్షాలకు తుప్పు పట్టి పాడైపోతున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టించాలని నిరంతరం అటు ప్రభుత్వం, ఇటు ఉన్నత స్థాయి అధికారులు చెబుతున్నారు. ఆచరణలో మాత్రం అధికారులు నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారని చెప్పవచ్చు.

మరమ్మతులు చేయిస్తాం..

మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలకు సంబంధించి ఈ–ఆటోలు, రిక్షాలకు మరమ్మతులు చేయించాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి తెలిపారు. దెబ్బతిన్న వాహనాలను గుర్తించి వాటికి త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు.